

# అదృష్టవంతులు

ఆంధ్రదేశంలోని అతికొద్ది మంది అదృష్టవంతుల్లో నేనూ ఒకడ్ని. అంటే- ఏ చీకూ చింతాలేని ఐశ్వర్యవంతమూ, ధనవంతమైన జీవితాన్ని గడుపుతున్నవాడ్నని కాదు. ఆ మాటకొస్తే - నిశ్చింతుడైన వాడెవ్వడూ ఈ భూప్రపంచంలో లేడు. కానీ, ఉన్నంతలో, ఉద్యోగం నుండి రిటైరయ్యాక కూడా ఇంత తృప్తిగా కాలం వెళ్ళదీస్తున్నవాళ్ళు ఖచ్చితంగా అరుదే.

నేను మధ్యతరగతి ప్రతినిధినే. నాకూ పిల్లలున్నారు. ఇద్దరబ్బాయిలూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అమ్మాయి కాపురం బాగుంది. అల్లుడు ఉత్తముడు. పిల్లల మీద ఆధారపడాల్సిన అవసరంలేదు. నాకొచ్చే పెన్షను, ఉన్న బ్యాంకు బ్యాలెన్సూ శేష జీవితం హాయిగా గడుస్తుందనడానికి పూచీకత్తు.

మేము తమవద్ద ఉండాలనే ఆలోచన కొడుకులకే గాదు, అల్లుడుగారికీ ఉంది. కాని నేటి పరిస్థితుల్లో అందులోనూ హైదరాబాద్ లాంటి సిటీలో ఎవరిదగ్గరైనా

ఉండడం కోరి సమస్యలు తెచ్చుకోవడమేనని నాకు తెలుసు. అందుకే మేం విడిగానే సొంత ఫ్లాట్‌లో ఉంటున్నాం. ఇది అందరికీ సౌకర్యం. పిల్లలకు దూరంగా ఉండడం మనసుకు కష్టమే. ముఖ్యంగా నా అర్ధాంగి లక్ష్మికి. ఈ మధ్య నాకు కొంత ఆధ్యాత్మిక సంబంధం అంటుతూండటం వల్ల మమకారాల బురద అంతగా అంటడం లేదు. అయినా చూడాలనుకున్నప్పుడల్లా వాళ్ల వాళ్ల దగ్గరికెళ్ళి ఒకటి రెండు రోజులుండి రావటం - అందరూ సిటీలోనే ఉండడం వల్ల లాభిస్తోంది. జీవితం మరీ రొటీన్ అనిపించినప్పుడల్లా 'వెంకన్న' దగ్గరికో, 'నరసింహస్వామి' దగ్గరికో వెళ్ళి నాలుగురోజులు గడపటం - పుణ్యమూ, పురుషార్థమూ సాధించినట్టూ అవుతోంది.

సిటీ జీవితం చాలా మందితో 'ఛీఛీ!' అనిపించుకుంటోంది గాని, మాకు అలాంటి ఇబ్బంది ఎప్పుడూ అనిపించలేదు. 'మురికి నీళ్లలో కప్పలకు ఇబ్బందేంటి?' అనుకోవచ్చు. అలా అనుకునేవాళ్ళను పట్టించుకోవడం నాకిష్టంలేదు. మొత్తంమీద నేనెన్నుకున్న జీవనశైలి వల్లనైతే నేమి, క్రమశిక్షణ కారణంగానేమి - ఆధునిక సమాజంలోనూ ఆనందంగా గడుపుతున్నాననేది మాత్రం నిర్వివాదాంశం.

"రుక్మిణీ కళ్యాణం నుండి ఓ మంచి పద్యం వినిపించవోయ్ !" వేడి వేడి కాఫీ చప్పరిస్తూ అడిగాను లక్ష్మిని.

"అబ్బ! నిన్న మొన్నటిదాకా క్రమం తప్పకుండా పంచశతావధానానికి వెళ్ళి వందలకొద్దీ పద్యాలు విన్నారు కదా! ఇంకా తృప్తి కల్గలేదా?" మెత్తగా విసుక్కుంటూ తనూ కాఫీ తాగడంలో లీనమైంది.

"అలిగారా?" కాఫీ తాగడం అయ్యాక అడిగింది తాపీగా. అదేమిటో ఆమె బలహీనత. కాఫీ తాగడం ఆవిడకో యోగం. ఆ సమయంలో ఎంతమాత్రమూ డిస్టర్బెన్సుని భరించలేదు. తెలిసీ ఆ పని చేయడం నా తప్పేకదా !

సమాధానంగా నిట్టూర్చాను.

"రండి!" ఈసారి పిలుపు పడకగదిలోంచి.

"అబ్బా! ఇక్కడికే రావోఁ! అపార్టుమెంటనే అగ్గిపెట్టెలో ఇదో గుగ్గిపెట్టె. ఇక్కడ ఎవ్వరిదీ ఇంకొకళ్ళకి పట్టదు.."

"మీరలాగే అంటారు. మన ఆనందం కోసం మరొకరిని ఇబ్బంది పెడ్తామా ? రండి లోపలికి."

ఇదే, లక్ష్మికీ నాకూ తేడా. తను ప్రతీదీ లోతుగా ఆలోచిస్తుంది.

నెమ్మదిగా లేచాను. డోర్ బెల్ మోగింది - 'సందట్లో సడేమియా' అన్నట్టు.

'ఈవేళప్పుడు ఎవరై ఉంటారబ్బా!?' అనుకుంటూ తలుపు తీశాను.

ఆశ్చర్యం!...... ఎదురుగా బద్రి! అపనమ్మకంగా చూశాను.

"రావాలా? పోవాలా?" డోర్‌కి అడ్డంగా ఉన్న నన్ను చూసి అన్నాడు. పక్కకు తప్పుకున్నాను ఠక్కున.

"ఒరేయ్! నువ్వు మారలేదురా!" వాని జబ్బమీద గట్టిగా చరిచి, ఆలింగనం చేసుకున్నాను.

'చెలి కౌగిలింతకన్నను కలిగించు సుఖంబు సఖుని కౌగిలి...' అన్న నేస్తం శతకకారుని పద్యంలోని నిజాన్ని అనుభవిస్తూ ఉండిపోయాం.

"అబ్బ! ముందా డోర్ వేసెయ్యండి!" అక్కడి కొచ్చిన లక్ష్మి మందలించింది. 'ఇక ఆపుతారా?' అన్న అర్థంలో.

అదే మరి నవనాగరికత. గట్టిగా మాట్లాడకూడదు, మనసారా నవ్వకూడదు, తృప్తిగా తుమ్మకూడదు, మనకిష్టమైనవి పాడుకోకూడదు.... నాగరికత ముసుగులో మనం మనకు తెలియకుండానే మనసునీ, తత్సంబంధమైన గుండెనీ గట్టిగా అదిమిపట్టి, అనారోగ్యదేవతకు నైవేద్యంగా సమర్పిస్తున్నాం.

"ఎన్నింటికి బయల్దేరదాం?" కుశలప్రశ్నలు, షరా మామూలు మర్యాదలయ్యాక అడిగాడు బద్రి.

మేము ఒకరి మొహం ఒకరం చూసుకున్నాం.

"అంతొద్దు!" అన్నాడు వాడు సహజధోరణిలో - ఏదో సినిమా డైలాగుని గుర్తుకు తెస్తూ.

"ఎక్కడికి? అనే అర్థంలేని ప్రశ్నవేయకు," నా మనసులోని మాట నాలిక చివరిదాకా రాకముందే అన్నాడు వాడు...." మీరు బయల్దేరడానికి అరగంటో, గంటో... ఎంత సమయం కావాలో చెప్పండి. మీరు ఎంతసేపు వెయిట్ చెయ్యమన్నా చేస్తాను. అప్పుడే బయల్దేరదాం - మా ఇంటికి. నువ్వు ఏకారణం చెప్పినా నేను వినను..."

వాడలా మొండిగా మాట్లాడుతుంటే ఏమనేందుకూ తోచలేదు నాకు.

బద్రితో సంగారెడ్డిలో పదేళ్ళు కలిసి పనిచేశాను. జీవితంలో ఎన్నున్నా, ఎంతమంది బంధువులున్నా, ఆత్మీయుడైన స్నేహితుడొకడు తప్పక ఉండాలన్న నిజం అనుభవంలోకొచ్చింది అప్పుడే.

బాల్యంలో ఎంతో మంది స్నేహితులుంటారు అందరికీ. కాని, పూచిన పూలన్నీ దేవుని పాదాలవద్దకు చేరనట్లు - కడదాకా కలిసుండే నేస్తాలు కొందరే - కొందరికే.

జీవితాన్ని అనుభూతించడం మొదలుపెట్టాక మనల్ని పూర్తిగా అర్థం చేసుకోగలిగే మంచి మిత్రులు దొరకడం అదృష్టమే. ఆ అదృష్టమే మా బద్రి...

"ఏరా? కారణాలకోసం వెతుకున్నావా?" నా ఆలోచనలకు సమాంతరంగా వాడు. "నువ్వు చెప్పడానికి ఏ కారణమూ లేదు. అమ్మాయి పురిటికి రాదు. కొడుకులు బిజీ బిజీ. మనవడికి మళ్ళీ బళ్ళు తెరిచారు..." గతంలో చెప్పిన కారణాలను ఏకరువు పెట్టసాగాడు వాడు.

"ఉపన్యాసాలొద్దు. మేమొస్తున్నాం!" ఠక్కున వాడి నోరుకి తాళం వేశాను ఆ మాటతో.

"అదీ లెఖ్ఖ" నాగఫణి పంచశతావధానానికి మహాదేవమణి వ్యాఖ్యానంలా అన్నాడు వెంటనే.

నా నిర్ణయం లక్ష్మికి ఆనందదాయకమే అనిపించింది. భావాలు దాచుకోలేని ఆ కళ్ళను చూస్తే.

* * *

ఎనిమిదేళ్ళనాడు బద్రి చిన్నకొడుకు పెళ్ళికి వచ్చిన నాటికి, ఇప్పటికి సంగారెడ్డి స్వరూపంలో చాలా మార్పొచ్చింది. అనేకానేక పట్టణాల్లాగే ఇదీ శరవేగంతో విస్తరిస్తూంది కాని, మా బద్రిలాగే వాని ఇల్లూ మారలేదు.

ఉద్యోగంలో ఉన్ననాడు నూటా ఇరవై అయిదు గజాల్లో కట్టుకున్న ఇల్లు. ఒక హాలు, రెండు బెడ్రూములు. మిగతా సౌకర్యాలు... చిన్నకొడుకు శ్రీధర్ పెళ్ళికాగానే ఓ చంకలో ఉద్యోగాన్ని, మరో చంకలో పెళ్ళాన్నీ వేసుకొని ఊళ్ళు తిరుగుతున్నాడు. ఎప్పుడో ఏడాదికోసారిగానీ ఇంటికి రాడట. వచ్చినా నాలుగు రోజులు ఉండడు. ఇక పెద్దవాడు ప్రేమ్ మొదటి నుండీ పెళ్ళికి విముఖుడు. 'ఆ ఊసెత్తితే ఇల్లొదిలి వెళ్ళిపోతా'నన్న మాటను ఎకె.47లా ఎప్పుడూ వెంటబెట్టుకొని తిరుగుతాడు. ఉద్యోగంలేదు. ఊరకుండే రకం కాదు. తండ్రి నడగడు, తల్లికి పెట్టడు. వానాకాలం ఎండలా సాగిపోతోంది వాళ్ళ జీవితం.

"ఏరా? ఏం పని చేయవా?" రెండోరోజు యథాలాపంగా అడిగాను.

"పని చేయకుండా ఎలా ఉంటాను మావయ్యా? ఏదో ఒకటి చేస్తూనే ఉన్నాను గదా!" చాలా మామూలుగా జవాబిచ్చాడు ప్రేమ్.

"ఔనయ్యా! క్షణం తీరికలేదు. దమ్మిడీ ఆదాయం లేదు." మా లక్ష్మి కీలెరిగి వాతపెట్టే ప్రయత్నం.

అందరమూ నవ్వాం. ప్రేమ్ కూడా మాతో శ్రుతి కలిపాడు.

"అసలు నువ్వు ఉద్యోగంలో చేరితే మా పారిజాతను నీకివ్వాలనుకున్నాం." పాతరోజులు గుర్తుకు చేసుకుంది లక్ష్మి. "అప్పుడసలు పెళ్ళే వద్దంటివి. ఏ ఉద్యోగమూ నీకు తూగకపోయె. నీ కళ్ళముందే శ్రీధర్ పెళ్ళి చేసుకుని తండ్రి కూడా అయ్యాడు..." సడెన్‌గా కరెంటుపోతే ఆగిపోయే టీ.వీ.లా నోర్మూసుకుంది. కారణం అతను ఏమాత్రం ఆ మాటల పట్ల ఆసక్తి చూపకపోవడమే.

బద్రి భార్య రాగిణి కళ్ళలో మాత్రం ఏదో ఆశ మినుకు మినుకు మంటోంది. బద్రిలో అదీ లేదు.

ఇంతలో ఎవరో నలుగురు యువకులొచ్చారు. హడావుడిగా వాళ్ళతో వెళ్ళాడు ప్రేమ్.

"ఏమో వదినా! నువ్వంటూండే దానివే - 'కట్నం కొద్దీ మొగుడు, ఖర్మకద్దీ పిల్ల'లని. మొదటి మాటేమోగాని పిల్లలు మాత్రం కర్మఫలమే." వెళ్తున్న కొడుకును చూస్తూ నిట్టూర్చింది రాగిణి.

క్రమేపి ఆడవాళ్ళిద్దరూ మా ఉనికిని మరిచి, కబుర్లలో పడ్డారు.

నేనూ, బద్రీ 'టీ.వీ. కన్నా చీట్లపేక నయం' అనే ఈక్వేషన్‌లో విలువల్ని ప్రతిక్షేపించే పనిలో పడ్డాం. ముందు నలుగురమూ కలిసి క్యారమ్స్ ఆడుకుందాం అనుకున్నాం గానీ, చివికిపోయిన క్యారం బోర్డున్నా కాయిన్స్ కనిపించలేదు. బయటికెళ్ళే ఓపికాలేదు. మధ్యాహ్న భోజనం తర్వాత ఆ పనిచేద్దామంటూ దాటేసి, ఈ పనిలో పడ్డాం. ఆటకంటే మాటల్లోనే మజాననుభవిస్తూ, సమయాన్ని చప్పరించేయసాగాం.

రాగిణి, లక్ష్మి బాతాఖానీ వేదిక నట్టింట్లోంచి వంటింట్లోకి మారింది.

"అంకుల్! ఓసారి బయటికొస్తారా?" సడన్‌గా వగరుస్తూ వచ్చి అడిగాడో యువకుడు.

పరిశీలనగా చూశాను. కరెక్టే! ఉదయం వచ్చిన శాల్తీల్లో ఒకడులా ఉన్నాడు. మొహంలో ఏదో కంగారు స్పష్టంగా కనిపిస్తుంది. గడియారం వంక చూశాను. పన్నెండున్నర గావస్తూంది.

"ఏమైందిరా? ప్రేమేడీ?" కళ్ళజోడు సవరించుకున్నాడు బద్రి. ఆటలో నుండి డిస్టర్బ్ కావడం ఇష్టంలేదు వాడికి. పైగా గెలుపు ముంగిట్లో ఉన్నాడు.

"అదే అంకుల్! ఒక్క నిమిషం బయటికి రండి!" మరింత కంగారు.

"పర్లేదురా! చెప్పు! ఆ సార్ మనవాడే!" ఒకింత చిరాకు బద్రి గొంతులో.

కొంచెంసేపు తటపటాయించి, ఆపై గొంతు తగ్గించి చెప్పాడు ఆగంతకుడు- "ప్రేమన్నను పోలీసులు దీసుకపోయ్యిర్రు. మీరు జల్ది వచ్చి.."

బద్రి చేతిలోనుంచి ముక్కలు జారిపోయాయి.

అచేతనుణ్ణయ్యాన్నేను.

"నువ్వు పద. నేనొస్తున్నా" క్షణంలో తేరుకొని వచ్చినవాణ్ణి పంపించేశాడు. నా మెదడు మొద్దుబారి పోతున్నట్టనిపించసాగింది.

క్షణాల్లో డ్రెస్సు మార్చుకున్నాడు వాడు. "ఒరేయ్! ఆడవాళ్ళకు ఈ విషయం తెలియనీకు. నేను క్యారమ్స్ కాయిన్స్ కోసం వెళ్ళానని మేనేజ్ చెయ్యి అరగంటలో వచ్చేస్తాను." నాకు పని పూరమాయిస్తూనే బయలుదేరాడు.

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకానందు వల్లనేమో మెదడంతా బ్లాంక్‌గా అయింది. కనీసం బద్రికి తోడుగా వెళ్ళాలనైనా తట్టలేదు.

* * *

సంతోషంతో వచ్చాం. ఏదో పోగొట్టుకున్న అసంతృప్తితో వెళ్తున్నాం. నిజానికి ఈ పరిస్థితుల్లో మిత్రుడ్ని వదిలివెళ్ళడం మనస్కరించట్లేదు. కాని, ప్రతి సంక్రాంతి కి పిల్లలంతా ఇంటికొస్తారు. కాబట్టి తప్పదు. బద్రి కూడా వెళ్ళడమే మంచి దంటున్నాడు.

రాగిణికి మాత్రం రెండ్రోజులుగా కంటిమీద కునుకులేదు సరిగ్గా, కదిలిస్తే కన్నీళ్ళొలికిపోతున్నాయి.

నాలుగు రోజులు సరదాగా గడుపుదామనుకున్న మా ఆలోచనలు ఇలా నీరుగారిపోతాయనుకోలేదు. అందరిలో నిబ్బరంగా ఉన్నవాడు బద్రి ఒక్కడే. వాడైనా పైకి సరదాగా ఉండి అందరిలో హుషారు నింపే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ లోపల ఎన్ని అగ్నిపర్వతాలు పేలుతున్నాయో నేనూహించగలను.

మౌనంగా, భారంగా బస్టాండు చేరుకున్నాం. బద్రి ఇల్లులాగే బస్టాండూ మారలేదు.

రాదు, తెలీదు, చెప్పలేం (ఆర్.టి.సి.) అన్నట్టే ఉంది అక్కడి పరిస్థితి. 'మనకవసరం లేని బస్సులు బోలెడు అవసరమైనవే కరువు.' అనే నిజాన్ని మరోసారి గుర్తు చేస్తుండగా సమయంలో సాంద్రత పెరగసాగింది.

ప్రేమ్ విషయం తలచుకుంటేనే మాటలకందని బాధ. ఉద్యోగం లేదు. సంపా దన లేదు. పైగా తల్లిదండ్రులకు ఈ లేనిపోని చికాకులు...

"బద్రీ!" వాని భుజం మీద చెయ్యేసి ఆప్యాయంగా నొక్కాను.

"మళ్ళీ ఎప్పుడొస్తారు? ఈసారి మీ పిల్లలందరినీ తీసుకుని రావాలి." వాడు చాలా మామూలుగా అంటున్నారు.

అదే నాకు ఆశ్చర్యం!

"అది సరే! ప్రేమ్ గురించి ఏమాలోచించావురా? డబ్బులేమైనా కావాలా?" గొంతులో ఆదుర్దా దాచుకోవడం నావల్లకావట్లేదు.

"వాడికేంరా? వాడు మారాజు. తల్లి సరే. ఏదో హైరానా పడుతోంది. నాకు మాత్రం ఆవిషయంలో ఏమాత్రం బాధలేదు."

మరింత ఆశ్చర్యపోయాను.

"పోలీసులు వాడికి కొత్తకాదు. వాడూ పోలీసులకు కొత్తగాదు. ఈసారి బెయిల్‌మీద తీసుకురావడం సాధ్యం కాలేదు. కాని, వాడికి ఏమీజరగదు." బద్రి మాటల్లో స్థిరత్వం.

"ఉద్యోగం లేకపోయినా పెళ్ళి చేస్తే వాడు మారేవాడేమో!"

"మొదట్లో నేనూ అలాగే అనుకున్నానురా! మందలించాను కూడా. కాని, వాని జీవితంపట్ల వానికి స్పష్టమైన అభిప్రాయమున్నదని తెలిసింతర్వాత నేను కల్గించుకోవడం మానేశాను.

నాకు సరిగ్గా అర్థం కాలేదు. నామొహం చూస్తే ఆ సంగతి వాడికర్థమైన ట్లుంది. నిదానంగా చెప్పసాగాడు వాడు.

"శ్రీనూ! వాడి అభిప్రాయాలు చిత్రంగా ఉంటాయిరా. డిగ్రీలో వాడు కాలేజీ ఫస్టు. కాని, సడెన్‌గా చదువు మానేశాడు. 'ఉద్యోగం, సంపాదన...ఇవన్నీ తనను తాను ఉద్ధరించుకోవడానికే గాని, ఈ సమాజానికీ, దేశానికీ అవి ఉపయోగపడలేవు. అందుకే నేనేదైనా చేయాలి' అంటూ నిరంతరం ఆలోచించేవాడు. ఆ ఆలోచనల తీవ్రత చూసి వానికేమౌతుందోనని ఒక్కోసారి భయం కూడా కల్గేది. వివేకానం దుడు, అరవిందుడు, అంబేద్కర్ లాంటి వాళ్ళకు సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా చదివేవాడు. వానిలో ఏదో అద్భుతమైన శక్తి ఉన్నదని నాకు అర్థమైంది నెమ్మదిగా. కొన్నాళ్ళపాటు ఎక్కడెక్కడో తిరిగాడు. సంఘంకోసం, దేశంకోసం పనిచేస్తున్న ప్రముఖుల్ని కలిశాడు. ఇంటివద్ద ఉండమని తల్లిబతిమాలితే పెళ్ళి

ప్రస్తావన తేకూడదన్న షరతుపెట్టి ఉండటానికొప్పుకున్నాడు. అయినా ఇంట్లో ఉండటం నామమాత్రమే.

"ఎప్పుడూ వానివెంట యువకులు. సమస్యలెక్కడుంటే వాడక్కడ ప్రత్యక్షం. వాని వేషంలాగే భాష, ప్రవర్తన కూడా చాలా సీదాసాదాగా ఉంటాయి. ఎవ్వరినీ నొప్పించకుండా సమస్యల సాధనకు ప్రయత్నిస్తాడు..."

"సమస్యలంటే.....?" నాకు కొంచెం కొంచెం అర్థమవుతోంది.

"ఏ సమస్యైనా గావచ్చు!" బద్రిలో ఉత్సాహం పెరిగింది.. "కుటుంబ కలహాలు మొదలు ప్రభుత్వ పథకాలదాకా.... నల్లా, రోడ్డు, యువజన సహకార పథకాలు, ఆరోగ్య సమస్యలు అనాథ ప్రేతలకు అగ్ని సంస్కారాలు ఇలా... అన్నీనూ. వాని పరిజ్ఞానం, జ్ఞాపకశక్తి అమోఘం. చట్టానికి, న్యాయానికి, ధర్మానికి సంబంధించిన పుస్తకాలు బాగా చదివాడు. ఇంగ్లీషు, హిందీల్లోనూ ధారాళంగా మాట్లాడతాడు. నిత్య వ్యాయామంతో ఉక్కులా తయారైన వాని శరీరం, 'యోగా' మొదలైన నియమాలతో వజ్రంలాంటి వాని సంకల్పం మామూలు మనుషులలో కనిపించని ప్రత్యేకతలు. కళ్ళెదుట అన్యాయమో, ఆడపిల్లల్ని ఏడిపించటమో జరుగుతుంటే మనవాళ్ళకు కాదుగా అని తప్పుకొని తిరగడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎంతటివాడి మీదైనా చెయ్యి చేసుకోవడానికి వెనుకాడడు. ఫలితంగా పోలీస్‌స్టేషన్లకూ, కోర్టులకు వెళ్లడం.. వానికి చాలా సాధారణ విషయమైపోయింది. ఈసారి ఏకంగా సిఐఓ మీదనే చెయ్యి చేసుకున్నాడట. పోలీసులే బతిమాలి వాడ్ని స్టేషన్లో ఉంచారు.

మొదట్లో నాకిది చాలా చికాకు కల్గించేది. కాని, వాడు చేస్తున్న పని, వాడ్ని ఆరాధించే జనాన్ని చూశాక మనమెవ్వరమూ చేయలేని పని వాడు చేస్తున్నాడనిపించింది. అలాంటివాడు నా బిడ్డకావడం నిజంగా నాకు గర్వ కారణమేరా!... "పిల్లల్ని కని, మనల్ని తాతల్ని చెయ్యడం, ఇంతో అంత డబ్బు సంపాదించి కొంత మన మొహాన పడెయ్యడం, మనం పోయాక తలకొరివి పెట్టెయ్యడం - ఏ కొడుకైనా చేయగలడు. కాని, పదిమంది కోసం పగలూ రాత్రి నిస్వార్థంగా శ్రమిస్తూ మన కళ్ళముందే మనకంటే ఎత్తుకెదిగి దేవుడిలా పూజింపబడటం మా ప్రేమ్‌లాంటి వాడు మాత్రమే చేయగలడురా!" బద్రి కళ్ళలో నీళ్లు, కంఠంలో గర్వం పోటీపడ్డాయి.

"వానికి ప్రచారమంటే అస్సలు ఇష్టం ఉండదురా. అదేగనక ఉంటే ఈపాటికి చాలా పాపులర్ అయ్యుండేవాడు. అలాగని వాడేదో అజ్ఞాతవాసంలోనో, అండర్ గ్రౌండ్‌లోనో అడవులు పట్టి తిరుగుతున్నాడనుకోవద్దు. ప్రజల మధ్యలోనే బ్రతుకుతున్న ప్రజల మనిషిరా వాడు. మిగిలిన వాళ్ళు ఆశల కోసం ఆరాటపడుతూ ఉండగా, వాడు ఆశయాల కోసం పోరాడుతూ ఉన్నాడు" వాని మొహంలో స్వచ్ఛమైన వెన్నెల వెలుగు.

'ప్రపంచ పటంలో ఆసియాలా వాడు, శ్రీలంకలా నేను' అనిపించసాగింది నాకు.

"బద్రీ! నాదో చిన్న కోరికరా!"

'ఏమి' టన్నట్లు చూశాడు వాడు.

"ఒక్కసారి ప్రేమ్‌ని చూస్తానురా!" ఈరోజు ఉదయం దాకా నేను చూసిన ప్రేమ్‌కి, ఇప్పుడు చూడబోయే ప్రేమ్‌కీ గల అంతరాన్ని కొలుచుకుంటూ అడిగాను.

"నీ ఇష్టం!" క్షణమాలోచించి - బద్రి.

లక్ష్మిని అక్కడే కూర్చోబెట్టి పోలీస్‌స్టేషన్‌వైపు నడిచాం.

సంపాదించి సుఖంగా బతకడం, నేనూ నా పిల్లలు హాయిగా ఉండటమే అదృష్టంగా భావించే నాలో అంతకంటే గొప్ప అదృష్టం ఉంటుందనే భావం ఊపిరి పోసుకోసాగింది. నా బిడ్డలకంటే సమాజానికి ప్రేరణనివ్వగలిగే ప్రేమ్ లాంటి వాళ్ళు ఎంతో గొప్పవాళ్ళు. వాళ్ళను కన్నవాళ్ళే నిజమైన అదృష్టవంతులు. అలాంటి కొడుకులు ఊరికొక్కడున్నా ఈ దేశం సుభిక్షంగా, శాంతిప్రదంగా ఉంటుంది అనిపించసాగింది.

**(15-03-2004 జాగృతి సచిత్ర వారపత్రిక)**